నిండా ముంచిన వరుణుడు

- వర్షానికి తడిసిన వేరుశనగ
- నల్లగా మారిన కాయలు
- నాణ్యత తగ్గడంతో ధరల్లో కోత
- పశుగ్రాసానికి కూడా పనికిరాని వేరుశనగ కట్టె
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం



వర్షానికి తడిసి నల్లగా మారిన వేరుశనగ కాయలు

మడకశిర: వరుణుడు వేరుశనగ రైతులను కోలుకోలేని దెబ్బతీశాడు. తీరా పంట చేతికొచ్చిన సమయంలో వరుసగా వర్షాలు కురవడంతో పంట చేతికందకుండా పోయింది. మరోవైపు మార్కెట్‌లో ధరలు తగ్గడంతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. మడకశిర నియోజకవర్గంలోని రైతులకు ఖరీఫ్‌లో ప్రధాన పంట వేరుశనగ. ఏటా రైతులు ఈపంటపై ఎంతో నమ్మకం పెట్టుకుని రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది వేరుశనగ సాధారణ సాగు 26,472 హెక్టార్లుగా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే 16,110 హెక్టార్లలో పంట సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో అదను వర్షాలు రాలేదు. వచ్చిన కొద్దిపాటి వర్షాలకే రైతులు విత్తనం వేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి వర్షణుడు రైతులను నిండా ముంచేశాడు.

ధర తగ్గుముఖం

వేరుశనగ ధర ప్రారంభంలో క్వింటాల్ రూ.7 వేల వరకు పలికింది. అయితే ప్రస్తుతం ఈధర రూ.5 వేలకు పడి పోయింది. ప్రధానంగా ధర పడిపోవడానికి కారణం నాణ్యత లోపించడమే. వేరుశనగ కాయలు నల్లగా మారడంతో నాణ్యత లేదని వ్యాపారాలు ధరల్లో కోత విధిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో రైతులు వేరుశనగను తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మడకశిర నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సాగైన వేరుశనగ విస్తీర్ణం	
మండలం	హెక్టార్లు
మడకశిర	4,142
అమరాపురం	3,884
గుడిబండ	4,200
రొళ్ళ	2,034
అగళి	1,850
మొత్తం	16,110

బీమాపైనే వేరుశనగ రైతుల ఆశలు

వర్షానికి వేరుశనగ తడిసి పూర్తిగా నష్టపోయిన రైతులు ప్రభుత్వం అందించే బీమాపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేరుశనగ రైతులు నష్టపోయినా ఏటా బీమాతో ఆదుకున్నారు. ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకు కూడా బీమా అందించారు. ఈ ఏడాది కూడా వేరుశనగ రైతులకు పంట దిగుబడి రాలేదు. ధరలు తగ్గు ముఖం పట్టాయి. అధిక వర్షాల కారణంగా పంట తడిసి పోయి నాణ్యత తగ్గి రైతులకు నష్టాన్ని తెచ్చిపెట్టింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం నష్టపోయిన వేరుశనగ రైతులకు పంటల బీమా అందించి ఆదుకుంటుందో లేదో వేచి చూడాల్సిందే.

పూర్తిగా నష్ట పోయాం



ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. పంట కోత సమయంలో అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం. వర్షానికి కాయలు నల్లగా మారాయి. వేరుశనగ కట్టె కూడా పశుగ్రాసానికి పనికి రాకుండా పోయింది. వేరుశనగ కాయల ధర కూడా తగ్గిపోయింది. -హనుమంతరాయప్ప, రైతు, ఫణారం, గుడిబండ మండలం

రైతులకు బీమా అందించి ఆదుకోవాలి



వేరుశనగ సాగు చేసి పూర్తిగా నష్ట పోయాం. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి అప్పుల పాలయ్యాం. ప్రభుత్వం ఈవిషయాన్ని గుర్తించి వేరుశనగ రైతులను ఆదుకోవాలి. ప్రతి రైతుకూ పంటల బీమా అందించాలి. వైఎస్ జగన్ హయాంలో రైతులకు ఏటా వేరుశనగ పంటకు బీమా అందింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా వేరుశనగ రైతులకు బీమా అందించి అండగా నిలబడాలి. -మల్లేశప్ప, దొడ్డేరి, రొళ్ల మండలం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేషులు

హిందూపురం టౌన్: టపాసుల వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలుంటాయని తహసీల్దార్ వెంకటేషులు, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు, అగ్నిమాపక అధికారి ప్రభాకర్ హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని పట్టణంలో టపాసులు విక్రయించేందుకు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న 56 మందితో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా లైసెన్స్ లేకుండా దీపావళి పండుగకు మందుగుండు సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల వద్ద తప్పనిసరిగా నీరు, ఇసుక తదితర అగ్నిమాపక సామాగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మందు గుండు సామాగ్రి రహస్యంగా తయారు చేస్తున్నట్లు గమనిస్తే 100, 112కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎంజీఎం పాఠశాల మైదానంలో వ్యాపారులకు తాత్కాలిక స్థలాలను కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అమరేంద్ర, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

మడకశిరరూరల్: మండలంలోని ఎగువ రామగిరి గ్రామంలో శనివారం వాల్మీకుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి వాల్మీకి మహర్షి విగ్రహానికి సమర్పించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత, ఎంపీటీసీ కామరాజు, నాయకులు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ వాల్మీకుల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. వాల్మీకులు తమ పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలో ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. ప్రధానంగా జయమంగళి, పెన్నా నదుల పరివాహక ప్రాంతాల్లో ఇసుకాసురులు అక్రమార్జనకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపించారు. శాసనకోట, దాసరిపల్లి, నేతులపల్లి, శీగిపల్లి తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ శనివారం తహసీల్దారు కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. నది పరివాహక ప్రాంతాల్లో ఇసుకను తరలించడానికి అనుమతులు ఇవ్వొద్దని అధికారులను కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక తీసుకెళ్లేందుకు విచ్చలవిడిగా అనుమతులను ఇచ్చిందన్నారు. రైతుల బాధలను విస్మరించిందన్నారు. ఆయా పార్టీల నేతలకు ఇసుక, మట్టి అక్రమ రవాణాతో అక్రమార్జనకు తెరలేపిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక రవాణాపై విధించిన నియమ నిబంధనలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి



యానిమేటర్‌కు బహుమతి అందిస్తున్న బ్యాంకు అధికారి నాగార్జున

అమరాపురం: కెనరా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ బిబూ ప్రసాద్ మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో బ్యాంకు సిబ్బంది, హేమ మండల సంఘం సభ్యులు, ఆనిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ అధికారి మనోహర్ మాట్లాడుతూ బ్యాంకులో మహిళా సంఘాలకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందిస్తున్నామన్నారు. వడ్డీ లేని రుణాలు తీసుకోవాలంటే తప్పకుండా బ్యాంకు లింకేజీ చేయించాలన్నారు. బ్యాంకు ఏపీ రుణాలను అందిస్తుంది, వాటి ద్వారా ఆర్థికంగా ఏవిధంగా బలోపేతం కావాలనే విషయాలను వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బ్యాంకు వారు బహుమతులు అందజేశారు. ఏపీఎం ముత్యాలప్ప, సీసీలు, యానిమేటర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయండి

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎంపీపీ కవిత, పార్టీ నేత పాండుతో కలిసి దిగువ రామగిరి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఆంజనేయులు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల అమలు చేయలేదన్నారు.

సమయపాలన పాటించండి

అగళి: విధి నిర్వహణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి సూచించారు. శనివారం ఆమె మండల కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కేంద్రాలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు.

ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించండి

రొళ్ల: రబీలో బోరుబావుల కింద పంటలు సాగు చేసే మడకశిర నియోజకవర్గంలోని రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని ఏడీఏ కృష్ణమీనన్ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480, టమాట ఎకరాకు రూ.1600, వరి ఎకరాకు రూ.648 చొప్పున ప్రీమియం చెల్లించాలని తెలిపారు. డిసెంబర్ 15 లోపు ప్రీమియం చెల్లించిన రైతులకు పంట నష్టం జరిగినప్పుడు బీమా వర్తిస్తుందని వివరించారు.

వసతిగృహాల తనిఖీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక ఎస్సీ బాలురు, బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాలను శనివారం సాయంకాలం హిందూపురం ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇచ్చిన ఇంటి పనిని శ్రద్ధగా చేయాలన్నారు. క్రమ శిక్షణతో చదువుకుంటే భవిష్యత్‌లో మంచిస్థాయిలో స్థిరపడతారన్నారు. అనంతరం భోజన నాణ్యతపై ఆరా తీశారు. బయటి ఆహార పదార్థాలు తినొద్దని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మేట్రిన్ మహదేవి, విద్యార్థులు ఉన్నారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

మడకశిర: మడకశిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన అధ్యాపకులు, అధ్యాపకేతర బృందంతో సమావేశమయ్యారు. కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

సంక్షిప్త సమాచారం

నేడు వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి స్త్రీల వ్యాధి నిపుణులు జ్యోతి, హిందూపురం సాయి నేత్రాలయం ఆసుపత్రి నిర్వాహకుడు కృష్ణమోహన్ హాజరవుతారన్నారు.

కంటి వైద్య శిబిరం

గుడిబండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఎస్ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్యుడు అఖిల్ 79 మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులతోపాటు కంటి అద్దాలు పంపిణీ చేశారు. శుక్లాలు ఉన్న వారికి బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని వైద్యుడు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

పావగడ: తాలూకాలోని మరిదాసన హళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాగరహొళె ప్రాంతం విజ్ఞానయాత్రకు శనివారం తరలి వెళ్లారు. స్థానిక అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టూరిస్ట్ బస్సుకు ఎమ్మెల్యే వెంకటేశ్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా వారి ఇళ్లకు క్షేమంగా చేర్చాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఏసీఎఫ్ మల్లికార్జున, ఆర్ఎఫ్ఓ రాకేశ్, తదితర అరణ్యాధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని పాలేపల్లి సమీపంలో శనివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. వారి నుంచి రూ.5720 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులపై నిఘా

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో రాత్రి సమయంలో గుర్తు తెలియని కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని సీఐ రామారావు తెలిపారు. మణూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలో కానుకలు చోరీ చేసినట్లు శనివారం తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే ఘటన స్థలాన్ని పరిశీలించామన్నారు. చోరీ మూడు రోజుల క్రితం జరిగినట్లు తెలిసిందన్నారు. రాత్రి సమయంలో కొత్త వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

పెనుకొండ రూరల్: మధ్యాహ్న భోజనం కార్మికులకు గౌరవ వేతనాలు పెంచాలని కోరుతూ తహసీల్దార్ శ్రీధర్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్నారన్నారు. రోజుకు దాదాపుగా 8 గంటలు పాటు కార్మికులు పనిచేస్తున్నా.. కేవలం రూ.3 వేలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. వేతనాలు పెంచడంతో పాటు ప్రతి నెల 5వ తేదీ లోపు బిల్లులు చెల్లించాలని కోరారు. ప్రమాద బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, బాబావలి, రాజురావు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి

హిందూపురం: విద్యార్థులు చదువును ఒత్తిడి, భయంతో కాకుండా ప్రశాంతంగా దినచర్యలో భాగంగా అలవాటుగా చేసుకుంటే భారం అనిపించదని హైదరాబాద్‌కు చెందిన వరల్డ్ మెమరీ కౌన్సిల్ చీఫ్ ఆర్బిటర్ జేఎస్‌పీ రాజ్ అన్నారు. హిందూపురం పట్టణంలోని 7స్టార్ ఫంక్షన్ హాల్‌లో శేఖర్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి విద్యార్థులు ఒత్తిడిని జయించడం అంశంపై సెమినార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సూపర్ స్పీడ్ మ్యాథ్స్ టిప్స్, పవర్‌ఫుల్ మెమొరీ సీక్రెట్, హౌ టు ఫోకస్ ఆన్ స్టడీస్, వాల్యూ ఆఫ్ పేరెంట్స్ అంశాలపై వివరించారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన ఐచర్

పెనుకొండ: పట్టణ సమీపంలోని యోగా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. కియా కంపెనీకి చెందిన కంటైనర్ రిపేరీ రావడంతో డ్రైవర్ హైవేపై రోడ్డు సగభాగంలో నిలిపాడు. అయితే ఉదయం వేగంగా ఐచర్ వాహనం కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఐచర్ ముందు భాగం దెబ్బతింది. కాగా ఈ ఘటనలో డ్రైవర్ ఎటువంటి గాయాలు కాలేదు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

పెనుకొండ: హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని వై జంక్షన్ వద్ద శనివారం రాత్రి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఆటోలు నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని తెలిపారు. రోడ్డు క్రాస్ చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాహనాలను వేగంతో నడపవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీ రహదారిపై గుట్టూరు, కియా పరిసరాల్లో ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణ, నిబంధనలు, హెల్మెట్ వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

చెరువుల వేలంలో పంచాయతీకి ఆదాయం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం చేపల పెంపకానికి నిర్వహించిన వేలంలో పంచాయతీకి రూ. 3.58 లక్షలు ఆదాయం లభించింది. కార్యదర్శి రామ్లా నాయక్ మాట్లాడుతూ చిలమత్తూరు చెరువును సుధాకర్ అనే వ్యక్తి రూ.3,0,4200ఎ దక్కించుకున్నారన్నారు. అలాగే మరవకొత్తపల్లికి చెందిన ఈదులకుంటను నాగభూషణ్‌రెడ్డి రూ.54 వేలకు దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ప్రభుదాస్, సర్పంచ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చింతఫల సాయం వేలం

రొళ్ల: మల్లినమడుగులో శనివారం సర్పంచ్ శారదమ్మ ఆధ్వర్యంలో చింతఫల సాయాన్ని వేలం వేశారు. గుడిబండ మండలం పీసీగిరి గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప అనే వ్యక్తి చింతఫల సాయాన్ని రూ.61 వేలకు దక్కించుకున్నట్లు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంజే యంజారప్ప, వ్యాపారస్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలు స్వావలంబన దిశగా ఎదగాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: మహిళలు స్వావలంబన దిశగా ఎదిగాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేశ్ సూచించారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగమందిరంలో శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వర మహాలక్ష్మి పూజ, ధార్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధర్మ స్థల సంస్థ తాలూకా వ్యాప్తంగా ఇప్పటికే 38 వేల మంది మహిళలతో 3,800 స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు అందించిందన్నారు. ఈ రుణాలతో మహిళలు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ కుటుంబాలను ఎలాంటి ఒడి దుడుకులు లేకుండా సాగిస్తున్నారని కొనియాడారు. స్వామి జపానంద, మున్సిపల్ చైర్మన్ రాజేశ్, ఉపాధ్యక్షురాలు గీత, తదితర కౌన్సిలర్లు, ధర్మ స్థల సంస్థ యోజనాధికారి మహేశ్, ఎస్ఐ గురునాథ్, నరసింహారెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతికి తరలిరండి

పావగడ: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలకు వాల్మీకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయంతిని విజయవంతం చేయాలని స్థానిక వాల్మీకి యువజన సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి శనివారం కోరారు. వచ్చే నెల 3 న ఆదివారం ఉదయం కుమార స్వామి లే అవుట్‌లోని వాల్మీకి ఆలయం పూజల అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని వెండి రథంలో ఊరేగిస్తామన్నారు. వాల్మీకి మహిళలు పూర్ణ కుంభ కళశలను మోస్తారన్నారు. అనంతరం చౌడేశ్వరి దేవాలయంలో హారతి వెలిగించి భక్తులకు ప్రసాదం అందిస్తామన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు

లేపాక్షి: స్థానిక నీలం సజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం బిసలమానేపల్లికి చెందిన వ్యాపారవేత్త లోకేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందికి గుండె ఆపరేషన్ అవసరమని గుర్తించి బెంగళూరులోని మార్క్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఆర్గనైజర్ వినోద్‌కుమార్, డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను అందజేస్తున్న కురుడి పద్మనాభయ్య కుటుంబీకులు

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థులు, ప్రముఖ ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన కేపీ సుజాత, కేపీ నీరజ, కేపీ త్రివేణి, శ్రీనివాస మూర్తి, రాజేష్, ప్రసాద్ తదితరులు రూ.2 లక్షలు విలువైన కంప్యూటర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. 1974-76లో ఇదే కళాశాలలో తాము చదువుకున్నామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, డీఐ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అమరాపురం: వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారంతమ్మడేపల్లిలో నిర్వహించిన వాల్మీకి జయంతి ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి యావత్ భారతదేశానికి ఆదర్శప్రాయుడన్నారు. ఆయన అడుగు జాడల్లో అందరూ నడవాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మీనారాయణను స్థానిక వాల్మీకి కులస్తులు శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానం చేశారు. మడకశిర వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు మోహన్, రాష్ట్ర వాల్మీకి సంఘం కార్యదర్శి అనిల్ కుమార్, స్థానిక వాల్మీకి కమిటీ అధ్యక్షుడు హనుమంతరాయ, కార్యదర్శి శివానంద పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెనుకొండ రూరల్: తన భర్త అనిల్ కనిపించడం లేదంటూ భార్య మీనాక్షి శనివారం పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. మండలంలోని అడదాకులపల్లికి చెందిన అనిల్ నెలన్నర రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. బంధువుల ఇళ్లు, పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో భార్య మీనాక్షి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రూ.2 లక్షల విలువైన సెల్‌ఫోన్ల చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ సమీపంలో ఉన్న ఓ మొబైల్ షాప్‌లోకి శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చొరబడి సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. దుకాణ యజమాని వేణు తెలిపిన వివరాలు.. శుక్రవారం సాయంత్రం మొబైల్ షాప్‌కు తాళం వేసి వెళ్లాడు. అర్ధరాత్రి తరువాత షట్టర్ పగల గొట్టిన దుండుగులు షాపులోకి ప్రవేశించి దాదాపు రూ.2 లక్షలకు పైగా విలువ చేసే సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. చార్జర్లు, మరమ్మతుల కోసం ఉంచిన సెల్‌ఫోన్లను తీసుకెళ్లారు. వేణు శనివారం ఉదయం షాపు తెరవడానికి రాగా.. షట్టర్ పగలు గొట్టి ఉండటాన్ని గమనించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్ బాబు షాపు వద్దకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీలో చోటు



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రామాంజినప్ప

పరిగి: శ్రీసత్యసాయి జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీలో సభ్యుడిగా మండలానికి చెందిన బీచిగానిపల్లి రామాంజినప్పకు చోటు లభించింది. శనివారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీని పియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ క్రమంలో ఎస్సీ వెల్ఫేర్, ఎంప్లాయ్‌మెంట్ అధికారి శివరంగ ప్రసాద్ చేతుల మీదుగా రామాంజినప్ప నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

తిరుమలకు తరలిన పాదయాత్ర బృందం



తిరుమలకు బయలుదేరిన పాదయాత్ర బృందం సభ్యులు

హిందూపురం: స్థానిక బాలాజీనగర్‌లోని వేంకటేశ్వర దేవాలయం నిర్వాహకుల ఆధ్వర్యంలో శనివారం తిరుమలకు పాదయాత్ర బృందం బయలుదేరింది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం ఆలయంలో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్ర బృందం కన్వీనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతికి భక్తులు బయలుదేరారు. కాగా తిరుమలకు బయలుదేరిన పాదయాత్ర బృంద సభ్యులకు త్యాగరాజనగర్ శివాలయం కమిటీ రూ.9 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, ఆంజనేయులు త్యాగరాజనగర్ శివాలయం కమిటీ సభ్యులు గోవింద రెడ్డి,అశోక్ కుమార్, జనార్దన్ రెడ్డి, సత్యప్ప, అర్చకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

మడకశిర: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ క్లాప్‌మిత్రలు, గ్రీన్ అంబాసిడర్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కోరారు. ఈ మేరకు శనివారం వారు పట్టణంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం రూ.6 వేల వేతనంతో పని చేస్తున్నామన్నారు. నెలల నుంచి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం నుంచి వెంటనే వేతనం ఇప్పించాలని కోరారు. ఏఐటీయూసీ అనుబంధం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, నాయకులు జయర్ధన్, రామచంద్రప్ప, కవితమ్మ, నరసింహమూర్తి, నరసింహప్ప, జయలక్ష్మమ్మ పాల్గొన్నారు.